క్లుప్తంగా

బి.కోడూరులో కార్డన్ సెర్చ్



కార్డెన్ సెర్చ్ అనంతరం గ్రామస్తులతో మాట్లాడుతున్న పోలీసులు

బండి ఆత్మకూరు: మండలంలోని బి.కోడూరు గ్రామంలో ఆదివారం పోలీసులు నిర్వహించిన కార్డన్ సెర్చ్‌లో 10 లిక్కర్ బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ జగన్మోహన్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆదివారం తెల్లవారుజామున గ్రామంలోని అనుమానితుల ఇళ్లల్లో సోదాలు చేపట్టామని, ఈ క్రమంలో పాములేటి అనే వ్యక్తి దగ్గర 10 క్వార్టర్ల మద్యం బాటిళ్లు, సరైన ధ్రువ పత్రాలు లేని 6 మోటార్ సైకిళ్లను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు చెప్పారు. అనంతరం గ్రామ ప్రజలతో సమావేశం నిర్వహించి ఎలాంటి గొడవలు ,అల్లర్ల జోలికి వెళ్లకుండా శాంతియుతంగా జీవించాలని సూచించారు. మహానంది ఎస్ఐ రామ్మోహన్, గోస్పాడు ఎస్ఐ వెంకటప్రసాద్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

తప్పిన ప్రమాదం





చెట్టును ఢీకొన్న కారు, గాయపడిన కారు డ్రైవర్

ఆత్మకూరు: కర్నూలు–గుంటూరు జాతీయ రహదారిలోని శ్రీశైలం వైపు ఉన్న రైస్‌మిల్ వద్ద బస్సు, కారు ఢీకొన్న సంఘటనలో ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. వివరాలు.. గుంటూరుకు చెందిన ఇద్దరు వ్యక్తులు కారులో కర్నూలుకు వస్తుండగా కర్నూలు నుంచి శ్రీశైలంకు వెళ్తున్న ఆర్టీసీ బస్సు పట్టణ శివారులోని రైస్‌మిల్ వద్ద ఢీకొన్నాయి. అయితే రెండు వాహనాలు నెమ్మదిగా వెళ్తుండటంతో ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. గుంటూరుకు చెందిన కారు డ్రైవర్ నిద్రమత్తులో ఉండి బస్సును తాకి వేపచెట్టును ఢీకొట్టింది. దీంతో కారులోని ఇద్దరు వ్యక్తులకు స్వల్ప గాయాలయ్యాయి. క్షతగ్రాతులను ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ శంకర్‌రెడ్డి తెలిపారు.

మల్లన్న సేవలో ఆర్థిక శాఖ మంత్రి



పయ్యావుల దంపతులకు స్వామివారి చిత్రపటాన్ని అందజేస్తున్న ఈఓ

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల శ్రీభ్రమరాంబా మల్లికార్జున స్వామి,అమ్మవార్లను రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్ దంపతులు దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. ఆదివారం సాయంత్రం మల్లన్న దర్శనార్థం ఆలయం వద్దకు విచ్చేసిన వారికి ఆలయ రాజగోపురం వద్ద దేవస్థాన ఈఓ ఎం.శ్రీనివాసరావు, అర్చకస్వాములు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం పయ్యావుల దంపతులు మల్లికార్జున స్వామి వారికి రుద్రాభిషేకం, భ్రమరాంబాదేవికి కుంకుమార్చన తదితర ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. అమ్మవారి ఆలయం వద్దనున్న ఆశీర్వచన మండపంలో వేదపండితులు వేద మంత్రాలు పలుకగా, అర్చకులు ఆశీర్వచనాలు అందించారు. దేవస్థాన ఈఓ స్వామివారి శేషవస్త్రం, లడ్డూప్రసాదాలను, జ్ఞాపికను అందించి సత్కరించారు.

లేబర్ కోడ్లను రద్దు చేయాలి



సీఐటీయు జెండాను ఆవిష్కరిస్తున్న ఆపార్టీ నాయకులు

జూపాడుబంగ్లా: కార్మికుల అభివృద్ధికి ఆటంకంగా ఉన్న నాలుగు లేబర్‌కోడ్లను రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా నాయకుడు గోపాలకృష్ణ, వ్యవసాయ కార్మిక సంఘం నాయకుడు పక్కీర్‌సాహెబ్ డిమాండ్ చేశారు. ఆదివారం మండల కేంద్రమైన జూపాడుబంగ్లాలో సీఐటీయూ పతాకాన్ని ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్మికుల వ్యతిరేక విధానాలను అవలంబిస్తూ ప్రభుత్వ రంగసంస్థలను ప్రైవేటు పరం చేస్తూ కార్పొరేట్లకు ఊడిగం చేస్తోందన్నారు. కార్మికులు ఎన్నో పోరాటాలు చేసి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను యథావిధిగా అమలుచేయాలని డిమాండ్ చేశారు. కార్మికుల హక్కులను కాపాడుకునేందుకు ఈనెల 20న దేశవ్యాప్త సమ్మెను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమ్మెలో కార్మికులు భారీసంఖ్యలో పాల్గొనాలని పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో నాయకులు కర్ణ, ఆకులరాము, సిలార్‌బాషా, విజయ్, ఆటో కార్మికులు, తదితరులు పాల్గొన్నారు.

‘తారు’ మారిపోయింది!

- మెటల్ రోడ్డును తలపిస్తున్న పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్ బీటీ రోడ్డు
- అధికలోడు వాహనాలతో అడుగడుగునా గుంతలు
- అవస్థలు పడుతున్న పోతులపాడు, చాబోలు గ్రామాల ప్రజలు



మెటల్ రోడ్డును తలపిస్తున్న బీటీ రోడ్డు



జూపాడుబంగ్లా: పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్ రోడ్డు గుంతలమయంగా మారడంతో పోతులపాడు, చాబోలు గ్రామస్తులు, పర్యాటకులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. అధికలోడుతో టిప్పర్లు తిరుగుతుండటంతో బీటీ రోడ్డు ధ్వంసమై గుంతలమయమై మెటల్ రోడ్డును తలపిస్తోంది. అధికారులు స్పందించి రోడ్డు త్వరగా వేయించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

5.4కిలోమీటర్లు 50 నిమిషాల ప్రయాణం

కర్నూలు-గుంటూరు రహదారి నుంచి పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్ వరకు 5.4కిలోమీటర్ల మేర రోడ్డు ఉంది. ఐదేళ్ల క్రితం వరకు హెడ్‌రెగ్యులేటర్ వరకు బీటీ రోడ్డు ఉండేది. రాయలసీమ ఎత్తిపోతల పథకం నిర్మాణం కోసం మెయిల్ కంపెనీ, పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్ విస్తరణ పనుల కోసం పీఎస్‌సీ, వ్యాం కంపెనీలు వచ్చాయి. ఆయా కంపెనీలకు చెందిన టిప్పర్లు, భారీ వాహనాలు నిత్యం అధికలోడుతో తిరగడంతో 80బన్నూరు నుంచి హెడ్‌రెగ్యులేటర్ వరకు ఉన్న బీటీరోడ్డు ధ్వంసమై గుంతలమయమై మెటల్‌రోడ్డును తలపిస్తోంది. అడుగడుగునా గుంతలు ఉండటంతో 80బన్నూరు నుంచి 5.4కిలోమీటర్ల దూరంలో ఉన్న హెడ్‌రెగ్యులేటర్ చేరుకోవాలంటే అడుగు అడుగునా గుంతలమయంగా ఉన్న రోడ్డు వెంట ప్రయాణించేందుకు 50 నిమిషాల సమయం పడుతుండని పోతులపాడు, చాబోలు గ్రామస్తులు, ప్రయాణికులు, పర్యాటకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

పనులు చేయకుండా వెళ్లిపోయిన కంపెనీ

వాస్తవానికి 5.4కిలోమీటర్ల మేర ఉన్న పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్ రోడ్డు జలవనరులశాఖ అధ్వర్యంలో ఉంది. రాయలసీమ ఎత్తిపోతల పథకం పనులు చేపట్టిన మెయిల్(మెగా)కంపెనీ వారు పనులు ముగిసిన అనంతరం నూతన బీటీరోడ్డును నిర్మించి ఇస్తామన్నారు. తీరా పనులు నిలిచిపోవడంతో మెయిల్ కంపెనీ వారు రోడ్డువేయకుండానే ఉడాయించారు. దీంతో ఎస్టిమేషన్ డీవియేషన్ చేసి పీఎస్‌సీ కంపెనీ వారికి కేజీ రోడ్డు నుంచి పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్ వరకు రోడ్డు నిర్మాణం పనులు అప్పగించారు. ప్రస్తుతం పోతిరెడ్డిపాడు ఎస్సారెమ్సీ కాల్వ లైనింగ్ పనులు కొనసాగుతున్నందున ఇంకా రోడ్డు నిర్మాణం పనులు చేపట్టలేదు. దీంతో అడుగు అడుగునా గోతులమయంగా ఉన్న రోడ్డు వెంట ప్రయాణించలేక పోతులపాడు, చాబోలు గ్రామస్తులతోపాటు పర్యాటకులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. జలవనరులశాఖ అధికారులు చర్యలు తీసుకొని గుంతలమయమైన పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్ రోడ్డును బాగుచేయించి ప్రయాణం సవ్యంగా సాగేలా చేయాలని కోరుతున్నారు.



అడుగు అడుగునా గుంతలమయమైన పోతులపాడు- చాబోలు రోడ్డు

అమ్మవారికి పల్లకీ సేవ



పల్లకీలో స్వామిఅమ్మవార్లు

శ్రీశైలంటెంపుల్: శ్రీభ్రమరాంబామల్లికార్జున స్వామి వార్ల ఉత్సవమూర్తులకు ఆదివారం సందర్భంగా అమ్మవారి ఆలయ ప్రాంగణంలో పల్లకీ సేవ నిర్వహించారు. ముందుగా ప్రత్యేకంగా అలంకరించిన పల్లకీలో ఉత్సవమూర్తులు ఆశీనులు గావించి వేదమంత్రోచ్చారణల నడుమ ప్రత్యేక పూజలు చేసి, మేళతాళాలతో ఆలయ ప్రదక్షిణ చేశారు. పూజా కార్యక్రమాల్లో దేవస్థాన అధికారులు, అర్చకులు పాల్గొన్నారు.

కారుణ్య నియామకాలు చేపట్టాలి

ఆత్మకూరు: రాష్ట్రవ్యాప్తంగా కారుణ్య నియామకాల్లో జాప్యం వల్ల చనిపోయిన ఉద్యోగుల, ఉపాధ్యాయుల కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాయని గిరిజన ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షుడు జవహర్‌నాయక్ పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ వివిధ కారణాల వల్ల చనిపోయిన ఉద్యోగుల పిల్లలకు ప్రభుత్వం కారుణ్య నియామకం కింద ఉద్యోగాలను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే పలు కుటుంబాలు ఉపాధిలేక ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నారన్నారు. 12వ పీఆర్‌సీ ఇప్పటికే 22 నెలలు ఆలస్యమైందని, వెంటనే కమిటీ ఏర్పాటు చేసి 30 శాతం మధ్యంతర భృతిని ప్రకటించాలని, పాత ఆర్థిక బకాయిలను విడుదల చేయాలని కోరారు.

వైభవం.. లక్ష్మీనరసింహ స్వామి జయంత్యుత్సవం





శ్రీలక్ష్మి నరసింహస్వామికి పూజలు చేస్తున్న పండితులు, పూజలకు హాజరైన భక్తులు

ఆత్మకూరు: మండలంలోని నల్లకాల్వ గ్రామంలో వెలిసిన శ్రీ లక్ష్మీనరసింహస్వామి జయంతి వేడుకలను ఆదివారం వైభవంగా నిర్వహించారు. భక్తులు స్వామివారికి హోమాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే ఆలయంలో వెలిసిన లక్ష్మీమాతకు కుంకుమార్చన, నూతన అలంకార పూజలు చేశారు. వేకువజామున స్వామివారికి సుప్రభాత, విశేష హారతులు పట్టారు. పూజా కార్యక్రమాలకు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనడంతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. మధ్యాహ్నం స్వామివారి సన్నిధిలో అన్నదానం చేశారు.





మురళీనాయక్ చిత్రపటం వద్ద కొవ్వత్తులు వెలిగించి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి, మహానందిలో ర్యాలీ నిర్వహిస్తున్న ప్రజా సంఘాల నాయకులు

అమర జవాన్‌కు ఘన నివాళి

ఆత్మకూరు : ఇటీవల భారత్–పాకిస్థాన్ యుద్ధంలో వీరోచితంగా పోరాడి వీరమరణం పొందిన అగ్నివీర్ ఎం.మురళీనాయక్ మృతి బాధాకరమని ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం నంద్యాల జిల్లా గౌరవ సలహాదారులు కె.బాలునాయక్, వైస్ ప్రెసిడెంట్ ఎస్.రామ్‌బాలాజీనాయక్ అన్నారు. ఆదివారం పట్టణంలోని పాత బస్టాండ్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద జవాన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సంఘం ఆత్మకూరు మండల అధ్యక్షుడు నాగస్వామినాయక్, వైస్ ప్రెసిడెంట్ రమేష్‌నాయక్, జనరల్ సెక్రటరీ ఎస్.శివనాయక్, ఆర్గనైజింగ్ సెక్రటరీ మల్లికార్జుననాయక్ పాల్గొన్నారు.

- శ్రీశైలంటెంపుల్: దేశరక్షణలో ప్రాణాలర్పించిన తెలుగు వీరుడు, భారత సైనికుడు మురళీనాయక్‌కు ప్రాణత్యాగం మరువలేనిదని ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి అన్నారు. ఆదివారం శ్రీశైలంలోని ఎస్టీ కాలనీలో మురళీనాయక్ చిత్రపటానికి నివాళులర్పించారు. కొవ్వత్తులు వెలిగించి ఆయన మృతికి రెండు నిమిషాలు మౌనం పాటించారు.
- మహానంది: వీరమరణం పొందిన మురళీనాయక్ సేవలు ఎనలేనవని, యుద్ధరంగంలో దేశం కోసం ప్రాణాలొదిన ఆర్మీ జవాను త్యాగాన్ని దేశం మరిచిపోదని మండల యువజ సంక్షేమ సంఘం నాయకులు పెద్ద మురళీ, డమాల నాగచందు, జనసేన నాయకులు మారెడ్డి రామయ్య, పలు సంఘాల నాయకులు ఆదివారం కొనియాడారు. స్థానిక గిరిజన ఆశ్రమ పాఠశాల నుంచి నంది సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించారు.



ఆత్మకూరులో జవాన్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బంజారా సేవా సంఘం నాయకులు

ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్ తప్పనిసరి

జూపాడుబంగ్లా: ప్రతి ద్విచక్రవాహన దారుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించి బైక్‌ను నడపాలని లేకపోతే భారీ జరిమానాలు తప్పవని ఎస్ఐ లక్ష్మీనారాయణ తెలిపారు. ఆదివారం సాయంత్రం జూపాడు బంగ్లా ఆర్టీసి బస్టాండు సమీపంలో కేజీరోడ్డుపై వెళ్లే వాహనాలను తనిఖీ చేసి జరిమానాలు విధించారు. ఈసందర్భంగా వాహనాల దారులకు నూతన చట్టాలపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నూతన నిబంధనలతో మోటారు వాహన చట్టాన్ని అమలు చేస్తోందని, ఈ చట్టాల ప్రకారం నిబంధనలు ఉల్లంఘిస్తే డ్రైవర్లు, వాహనాల యజమానులకు భారీ జరిమానాలు తప్పవని హెచ్చరించారు.

భారీ జరిమానాలు

హెల్మెట్ లేకుండా బైక్ నడిపితే రూ.వెయ్యి, ఇన్సురెన్స్ సర్టిఫికెట్ లేకుండా వాహనాలు నడిపితే మొదటిసారి రూ.2వేలు, రెండోపర్యాయం రూ.4వేల జరిమానా విధించనున్నట్లు ఎస్ఐ తెలిపారు. లైసెన్స్‌లేకుండా వాహనం నడిపితే రూ.5వేల జరిమానా విధిస్తామన్నారు. పొల్యూషన్ సర్టిఫికెట్ లేకుండా వాహనాలు నడిపితే రూ.1,500లు, సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడిపితే మొదటి సారి రూ.1,500లు, రెండోపర్యాయం రూ.10వేలు జరిమానా విధించనున్నట్లు తెలిపారు. ఆటోడ్రైవర్లు యూనిఫాం లేకుండా నడిపితే మొదటిసారి రూ.150, రెండోపర్యాయం రూ.300 ఫైన్ వేస్తామన్నారు.



వాహనదారుడి రికార్డులు పరిశీలిస్తున్న ఎస్ఐ లక్ష్మీనారాయణ

కార్మిక వ్యతిరేక విధానాలపై పోరాటం

నంద్యాల(న్యూటౌన్): కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై పోరాటం తీవ్రతరం చేయనున్నట్లు ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి మునెప్ప అన్నారు. కేంద్రం తీరును నిరసిస్తూ ఈనెల 20న దేశ వ్యాప్త సమ్మె చేపట్టనున్నట్లు తెలిపారు. ఆదివారం స్థానిక సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఏఐటీయూసీ, సీపీఐ, ప్రజా సంఘాల నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆశా కార్మికులకు కనీస వేతనం, నాలుగు లేబర్ కోడ్‌ల రద్దు , ప్రభుత్వ రంగ సంస్థల పరిరక్షణ తదితర డిమాండ్లపై సమ్మె సాగుతుందన్నారు. ఇందులో కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి రఘురామ్మూర్తి, సీపీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి రంగనాయుడు, నాయకులు శ్రీనివాసులు, సుంకన్న, రమేష్‌బాబు, బాలకృష్ణ, ప్రసాద్, భాస్కర్, అబ్బాస్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి మునెప్ప



నాటి ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

ఉత్సాహంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం

వెలుగోడు: 25 ఏళ్ల క్రితం చదువుకున్న విద్యార్థులు అదే పాఠశాలలో కలుసుకొని వారి జ్ఞాపకాలను గుర్తుకు తెచ్చుకున్నారు. మండలంలోని వేల్పనూరు జిల్లా పరిషత్ పాఠశాలలో 1999–2000లో చదివిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా పూర్వపు ఉపాధ్యాయులు రఘునాథరెడ్డి,బసిరెడ్డి,శేష శయన శర్మ, రఫిక్ అహ్మద్, అబ్దుల్ ఖాదర్, అబ్దుల్,ఫిజికల్ డైరెక్టర్ శంకర్‌ను ఘనంగా సత్కరించి మెమొంటోలను అందజేశారు. పూర్వ విద్యార్థులు శ్రీను, శ్రీకాంత్ రెడ్డి, నూరుల్లా, మా బాషా, పరమేష్, వెంకటేష్, సుబ్బయ్య స్వాములు, సూరి, మద్దిలేటి పాల్గొన్నారు.

‘చలో సిద్ధేశ్వరం’ను విజయవంతం చేయండి



లింగాపురంలో కరపత్రాలను పంచుతున్న సాగునీటి సాధన సమితి నాయకులు

కొత్తపల్లి: ఈనెల 31వ తేదీన నిర్వహించే చలో సిద్ధేశ్వరంను విజయవంతం చేయాలని, సిద్ధేశ్వరం అలుగు సాధన కోసం జరిగే ఉద్యమంలో ప్రజలందరూ భాగస్వామ్యులు కావాలని రాయలసీమ సాగునీటి సాధన సమితి నాయకులు మహేశ్వరరెడ్డి పిలుపునిచ్చారు. సిద్ధేశ్వరం అలుగు ప్రజా శంఖుస్థాపన 9వ వార్షికోత్సవాన్ని విజయవంతం చేయాలని పెద్ద గుమ్మడాపురం, ముసలిమడుగు, ఎదురుపాడు, యం.లింగాపురం, గోకవరం తదితర గ్రామాలలో రాయలసీమ సాగునీటి సాధన సమితి నాయకులు ఆదివారం ప్రచార కార్యక్రమాలు నిర్వహించారు. ఆయన మాట్లాడూ సంగమేశ్వరం వద్ద మే 31న జరిగే ప్రజా బహిరంగసభ విజయవంతం చేసేందుకు మండలంలోని, రాయలసీమ జిల్లాలోని రైతులు తరలిరావాలని పిలుపునిచ్చారు. శ్రీశైలం ప్రాజెక్టు కోసం భూములు త్యాగం చేసిన నిర్వాసితులకు ఇంకా ఇప్పటి వరకు న్యాయం జరగలేదని ఆయన విమర్శించారు. కేవలం వేయి కోట్ల నిధులతో సిద్ధేశ్వరం అలుగు నిర్మాణం చేపడితే 60 టీఎంసీల నీరు నిల్వ చేసి రాయలసీమలో తాగు, సాగునీటి కష్టాలను తీర్చవచ్చునన్నారు. సమితి నాయకులు భాస్కర్ రెడ్డి, మనోజ్, విష్ణువర్ధన్ రెడ్డి, మూసా కలిముల్లా, అయ్యపురెడ్డి, చెన్నయ్య, శ్రీరాములు, సుబ్బరాయుడు, స్వామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కళ్యాణం...కమనీయం

కొత్తపల్లి: మండలంలోని గువ్వలకుంట్ల గ్రామంలో వెలసిన శివాలయంలో ఈశ్వరస్వామి తిరునాల సందర్భంగా పార్వతీ పరమేశ్వరుల కల్యాణం కమనీయంగా జరిగింది. శనివారం అర్ధరాత్రి 12.30 గంటల శుభముహూర్తాన పార్వతీ పరమేశ్వరుల కల్యాణ మహోత్సవాన్ని శాస్త్రోక్తంగా ఆలయ పురోహితులు లాల్‌బహదూర్ శాస్త్రి, గ్రామ పురోహితుడు రామయ్య నిర్వహించారు. కల్యాణ కార్యక్రమాన్ని తిలకించేందుకు గ్రామస్తులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



పార్వతీపరమేశ్వరుల కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

ఘనంగా ప్రభోత్సవం

గువ్వలకుంట్ల గ్రామంలో ఈశ్వరస్వామి తిరునాల సందర్భంగా ప్రభోత్సవ కార్యక్రమం ఆదివారం రాత్రి ఎంతో వైభవంగా ఆలయ పురోహితులు లాల్ బహదూర్ శాస్త్రీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ముందుగా పార్వతీపరమేశ్వరుల ఉత్సవ విగ్రహాలకు విశేష పూజా కార్యక్రమాలు చేపట్టారు. అనంతరం ప్రభపై కొలువుంచి భాజభజంత్రీలు, మేళతాళల నడుమ గ్రామ పురవీధుల వెంట ప్రభోత్సవం నిర్వహించారు. ప్రభోత్సవం జరుగుతుండగా గ్రామస్తులు, భక్తులు కాయకర్పూరం సమర్పించి ఉత్సవమూర్తులకు మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు, ఆలయకమిటీ సభ్యులు, గ్రామస్తులు, భక్తులు పాల్గొన్నారు.



పార్వతీపరమేశ్వరుల ప్రభోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

కేసీ సామగ్రి.. దొంగల పరం!

- వేలాలకు అనుమతివ్వని ఉన్నతాధికారులు
- 15ఏళ్లుగా పట్టించుకోని కేసీ కాల్వ పర్యవేక్షణాధికారులు

జూపాడుబంగ్లా: రూ.లక్షల విలువైన కేసీ కాల్వ ఇనుప సామగ్రి చోరీకి గురవుతున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యారు. 15ఏళ్ల క్రితం తాటిపాడు ఐదుగండ్ల షటర్లు, జూపాడుబంగ్లా 9లాకుల గేట్లకు పాత షటర్లను తొలగించి కొత్తవాటిని ఏర్పాటు చేశారు. తొలగించిన సుమారు రూ.10లక్షల విలువైన 14 గేట్ల షటర్ల ఇనుప సామగ్రిని స్థానిక కేసీ కాల్వ విశ్రాంతి భవనం వద్ద ఆరుబయట ఎలాంటి సంరక్షణ లేకుండా ఉంచారు. అప్పట్లో కేసీ కాల్వ ఏఈ గా విధులు నిర్వహించిన నరేష్ మూడేళ్ల క్రితం బదిలీపై వెళ్లారు. ఆయన స్థానంలో వచ్చిన ఏఈ శ్రీనివాస్‌నాయక్ కు ఇప్పటిదాకా సామగ్రికి సంబంధించిన బాధ్యతలు, రికార్డులు అప్పగించపోవటం గమనార్హం. ఎలాంటి సంరక్షణ లేకుండా ఆరుబయట పడేసిన ఇనుప సామగ్రిలో చిన్న చిన్న వస్తువులను గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేసినట్లు సమాచారం. వాస్తవానికి ఏ శాఖలోనైనా పనికిరాని వస్తువులు ఉంటే వాటిని ఉన్నతాధికారుల అనుమతితో వేలాలు వేసి వచ్చిన మొత్తాన్ని ప్రభుత్వ ట్రెజరీకి జమచేయడం పరిపాటి. అయితే కేసీ కాల్వ అధికారుల నిర్లక్ష్యం వల్ల రూ.10 లక్షల విలువైన ఇనుప వస్తువులు చోరీకి గురవుతున్నా పట్టించుకోవడం లేదు.



కేసీ విశ్రాంతి భవనం వద్ద ఆరుబయట మిగిలిన ఇనుప సామగ్రి

రికార్డులు అప్పగించలేదు

ఇప్పటి వరకు నాకు రికార్డులు అప్పగించలేదు. రికార్డులు లేనప్పుడు ఏఏ వస్తువులు ఉన్నాయో, ఏ వస్తువులు చోరీకి గురయ్యాయో నాకెలా తెలుస్తుంది. రికార్డులు అప్పగిస్తే వస్తువుల వివరాలు తెలుస్తాయి. రికార్డులు అప్పగించిన వెంటనే ఇనుప వస్తువుల వివరాలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి వారు అనుమతించిన వెంటనే వేలం వేస్తాం.

– శ్రీనివాస నాయక్, కేసీ కాల్వ ఏఈ



వైభవంగా లక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవం

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని తెలుగు పేటలో శ్రీ గణ మద్దిలేటి లక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవం వైభవంగా జరిగింది. ఆదివారం నృసింహ స్వామి జయంతిని పురస్కరించుకుని ఈ ఈ కార్యక్రమం నిర్వహించారు. కల్యాణోత్సవంలో భాగంగా మొదట స్వామి అమ్మవార్ల మూలవిరాట్‌కు ఉదయాన్నే సుప్రభాత సేవ, పంచామృత అభిషేకాలు, స్నాపన తిరుమంజన సేవా నిర్వహించారు. తర్వాత పట్టు వస్త్రాలతో స్వామి అమ్మవార్లను అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. తర్వాత వేద పండితులు శాస్త్రోక్తంగా పెళ్లి తంతు చేపట్టారు. అనంతరం మహా మంగళహారతి ఇచ్చి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. సాయంత్రం స్వామి అమ్మవార్లను గ్రామోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు మధుసూదన రాయల్, అర్చకులు రామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.



కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం